
## మిర్యాలగూడ మున్సిపల్
# నక్ష సర్వే 50 శాతం పూర్తి

**పైలట్ పద్ధతిన తొలుత మిర్యాలగూడ నక్ష సర్వే**

**కలెక్టర్ బి. చంద్రశేఖర్**



నల్గొండ టౌన్, అక్షిత న్యూస్ : నల్గొండ జిల్లాలో పైలెట్ పద్ధతిన చేపట్టిన మిర్యాలగూడ మున్సిపల్ నక్ష సర్వే 50 శాతం పూర్తి అయిందని, డేటా ఎంట్రీ 10% పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రాష్ట్ర సీసీఎల్ఏ లోకేష్ కుమార్‌కు తెలిపారు.32 వార్డులో 1552 ప్రాపర్టీస్ వివరాలు పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. శుక్రవారం రాష్ట్ర సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ ..మిగతా 2లో

www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

శనివారం | 20 | జూన్ | 2026 | పేజీలు: 08






# రూ.87 కోట్లతో రోడ్ల ప్రగతి

**రూ.87 కోట్ల సీఆర్ఎఫ్ రోడ్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**

**తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు**

**కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**



రంగారెడ్డి, అక్షిత బ్యూరో : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజక వర్గాల్లో చేపట్టిన, పూర్తయిన సుమారు రూ.87 కోట్ల విలువైన సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ( సిఆర్ఎఫ్ ) రోడ్ల పనులకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి శుక్రవారం శంకు స్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ..మిగతా 2లో

# నిఘా నీడన నీట్

**నీట్ పరీక్షకు సకలం సన్నద్ధం**

**అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి**

**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**




గద్వాల, అక్షిత న్యూస్ : జూన్ 21.2026న జరగనున్న నీట్ – 2026 పునః పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లీక్ ..మిగతా 2లో

# నాణ్యమైన విద్యతో విద్యార్థుల భవిత

**దిలావర్‌పూర్ కేజీబీవీ ఆకస్మిక తనిఖీ**

**కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్, అక్షిత ప్రతినిధి : ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగ్గా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న వసతులు, సౌకర్యాలను పరిశీలించి, పాఠశాల హాజరు పట్టికను తనిఖీ ..మిగతా 2లో



## రాహుల్‌తోనే
# దేశ ప్రజలకు క్షేమం

**టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి**

**సంగారెడ్డిలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు**

**200 కిలోల భారీ కేక్ కట్ చేసి చిన్నారులకు పంపిణి**

**350 మంది చిన్నారులకు సైకిళ్ల పంపిణీ**




సంగారెడ్డి, అక్షిత బ్యూరో: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను సంగారెడ్డిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 350 మంది చిన్నారులకు ఉచితంగా ..మిగతా 2లో

## మిర్యాలగూడ మున్సిపల్ నక్ష సర్వే 50 శాతం పూర్తి

మొదటి పేజీ తరువాయి...

హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్లతో నక్ష సర్వే తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తినందున సర్వే ఆలస్యం అవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. లైసెన్స్ సర్వేయర్లు సర్వేకు సంబంధించి సమ్మతి ఇచ్చినందున ఈనెల 20 లోగా వారినుండి సమ్మతి తీసుకొని గజిట్ నోటిఫికేషన్ ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు సీసీఎల్ఏ లోకేష్ కుమార్ మాట్లాడుతూ నక్ష సర్వేకి సంబంధించి సర్వే వేగవంతం చేయాలని, సర్వేకు సంబంధించిన సామాగ్రినంతటిని సి ఎస్ ఆర్ కింద సమకూర్చుకోవాలని తెలిపారు. సాదా బైనామకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను నెలాఖరు లోపు పరిష్కరించాలని, అలాగే రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను సైతం పరిష్కరించాలన్నారు. భూభారతి కింద 85వేల వరకు దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని కూడా పరిష్కరించడం పై జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలని చెప్పారు. నల్గొండ జిల్లా పెద్ద జిల్లా అయినందున నక్ష,సర్వే, సాదాబైనామా,రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు . రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎడి దేవరాజ్, తదితరులు ఉన్నారు.

## రాహుల్‌తోనే దేశ ప్రజలకు క్షేమం



మొదటి పేజీ తరువాయి...

సైకిళ్లు పంపిణీ చేయడంతో పాటు, 200 కిలోల భారీ కేక్‌ను చిన్నారులతో కలిసి కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దేశ ప్రజలు, ముఖ్యంగా ఉమ్మడి రాష్ట్ర ప్రజలు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సరైన నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులకు సవాల్ విసురుతూ, బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్, ఇక్రిశాట్, ఐఐటీ హైదరాబాద్ వంటి కీలక కేంద్ర ప్రభుత్వ సంస్థలు కాంగ్రెస్ హయాంలో సంగారెడ్డి జిల్లాకు వచ్చాయని పేర్కొన్నారు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తోందని విమర్శించారు. నెహ్రూ పాలనపై విమర్శలు చేస్తూ సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు, రాహుల్ గాంధీ కుటుంబం దేశానికి చేసిన సేవలను గుర్తించాలని సూచించారు. రాహుల్ గాంధీ తల్లి, తండ్రి, తాత, నానమ్మ, ముత్తాత దేశం కోసం చేసిన త్యాగాలు, సేవల గురించి తాను వివరించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. అదే విధంగా 12 సంవత్సరాలుగా ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ పాలనలో సాధించిన విజయాలను బీజేపీ నేతలు ప్రజలకు వివరించాలని సవాల్ చేశారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం యువతకు ఇప్పటివరకు 24 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని ఆరోపించారు. బీజేపీ నాయకులు దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేస్తూ ఇతర పార్టీలకు దేవుళ్లతో సంబంధం లేదన్న భావన కల్పించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని చిన్నారులకు 350 సైకిళ్లు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. దేశానికి సమర్థవంతమైన నాయకత్వం అవసరమని, ఆ బాధ్యతను రాహుల్ గాంధీ సమర్థంగా నిర్వర్తించగలరని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ.87 కోట్లతో రోడ్ల ప్రగతి

మొదటి పేజీ తరువాయి...

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, తిమ్మాపూర్ గ్రామానికి వివిధ ప్రాంతాలతో మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో సుమారు రూ.100 కోట్ల వ్యయంతో పలు రహదారి నిర్మాణ పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. కొంగర, రావిరాల, శ్రీశైలం రోడ్డు, లాచునూరు, అవరమియగూడెం, జబార్‌గూడ, ఎలిమినేడు, కప్పాడు, తుర్కగూడెం, చర్లపటేల్‌గూడెం, ఇబ్రహీంపట్నం రోడ్డు, గుమ్మడవెల్లి, మీర్‌ఖాన్‌పేట, కుర్మిద్ద తదితర ప్రాంతాలకు మెరుగైన రహదారి అనుసంధానం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా మాదాపూర్, బేగంపేట్ ప్రాంతాలతో కూడా కనెక్టివిటీ పెంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రంగారెడ్డి జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడితే గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఈ ప్రాంతం పట్టణీకరణ దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

**తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు**

దేశవ్యాప్తంగా ప్రతిపాదించిన బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుల్లో భాగంగా తెలంగాణకు మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రతిపాదించబడినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. హైదరాబాద్--



పూణే, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--చెన్నై మార్గాల్లో బుల్లెట్ ట్రైన్ల ఏర్పాటుకు ప్రాథమిక అంచనా వ్యయం సుమారు రూ.5 లక్షల కోట్లు కాగా, భూసేకరణ వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇది రూ.10 లక్షల కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్లకు సంబంధించిన సర్వే పనులు కొనసాగుతున్నాయని, సర్వే, డీపీఆర్ పూర్తైన వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఈ మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారనున్నాయని అభిప్రాయపడ్డారు. అలాగే హైదరాబాద్ చుట్టుపక్కల మరో రింగ్ రోడ్డు ఏర్పాటు చేసే దిశగా కూడా ఆలోచనలు జరుగుతున్నాయని, ఉత్తర హైదరాబాద్ ప్రాంతంలో భూసేకరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.20 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని రంగారెడ్డి జిల్లా గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, ఈ ప్రాంత అభివృద్ధికి రహదారి అనుసంధానం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషితో ఈ ప్రాంతానికి కేంద్ర నిధుల ద్వారా రూ.100 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరైనట్లు తెలిపారు. గతంలో కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందకపోవడం వల్ల కొన్ని రహదారి పనులు ఆలస్యమైన విషయం వాస్తవమేనని అంగీకరించిన మంత్రి, ఇకపై అలాంటి పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొంగర, రావిరాల, తిమ్మాపూర్, లాచునూరు, అవరమియగూడెం తదితర ప్రాంతాలకు సంబంధించిన అన్ని రహదారి నిర్మాణ పనులను తక్షణమే సమీక్షించి, రాబోయే కొద్ది నెలల్లో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రంగారెడ్డి జిల్లా, ముఖ్యంగా కందుకూరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిఘా నీడన నీట్

మొదటి పేజీ తరువాయి...

కారణంగా ప్రభుత్వం ఈనెల 21వ తేదీన ఇట్టి పరీక్షను తిరిగి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్ష నిర్వహణ కోసం ఒక కో-ఆర్డినేటర్, నలుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, నలుగురు డిప్యూటీ చీఫ్ సూపరింటెండెంట్లు, నలుగురు అబ్జర్వర్లు, 80 మంది ఇన్విజిలేటర్లు నియమించినట్లు కలెక్టర్ వెల్లడించారు.అదేవిధంగా ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక్కో తహసీల్దార్‌ను లైజన్ అధికారిగా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

భద్రతా పరంగా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక ఎస్సై,ఇద్దరు పురుష కానిస్టేబుళ్లు,ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లను విధుల్లో నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారన్నారు. నిర్ణీత సమయం దాటిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రం లోనికి వెళ్లేందుకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. హాల్ టికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక పోస్టుకార్డ్ సైజ్ ఫోటో తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఆధార్ కార్డు, పాన్ కార్డు,డ్రైవింగ్ లైసెన్స్,ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ వంటి ప్రభుత్వం గుర్తించిన ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు వైకల్యాన్ని ధ్రువీకరించే సర్టిఫికెట్లను తీసుకురావాలన్నారు.పరీక్ష హాల్ లోనికి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ వంటి ప్రక్రియలు చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు ముందస్తుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.



పరీక్ష కేంద్రానికి ఎలక్ట్రానిక్ ఉపకరణాలైన మొబైల్ ఫోన్లు, డిజిటల్ చేతి గడియారాలు, బ్లూటూత్ లు ఆభరణాలు వంటివి అనుమతించబడవని తెలిపారు.నీట్ పరీక్షకు సంబంధించిన ఏదైనా సమాచారం లేదా సందేహాల నివృత్తి కోసం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ మృతెలిపారు. అభ్యర్థులు 7702697697, 8309470647, 9848897759 నంబర్లను సంప్రదించి అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలను అమర్చడం జరిగిందని, పకడ్బందీ నిఘా నడుమ సజావుగా పరీక్ష జరిగేలా చర్యలు తీసుకున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

# నాణ్యమైన విద్యతో విద్యార్థుల భవిత

మొదటి పేజీ తరువాయి...

చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సంఖ్యకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పలు సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి వారి విద్యా నైపుణ్యాలను పరీక్షించారు. పుస్తక జ్ఞానంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని, ప్రతి విషయాన్ని శ్రద్ధగా నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. వసతి గృహంలోని స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, నిల్వ ఉంచిన కూరగాయలు, వంట సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. సరుకులు వచ్చిన వెంటనే వాటి నాణ్యతను పరిశీలించి, నాణ్యమైన సరుకులను మాత్రమే వినియోగించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే ప్రతిరోజూ రుచికరమైన, పోషకాహార భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. తనిఖీలో భాగంగా విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, మండల ప్రత్యేక అధికారి (డిఆర్డీఓ) రాథోడ్ రమేష్, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

## వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘనపూర్ అక్షిత న్యూస్:** జనగాం జిల్లా స్టేషన్ ఘనపూర్ పట్టణకేంద్రంలోని ఎమ్మెల్యేకార్యాలయంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, బావి భారత ప్రధాని రాహుల్ గాంధీ  పుట్టినరోజు వేడుకలలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు



ఎండగడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేస్తున్న గోప్ప నాయకులు రాహుల్ గాంధీ గారని వెల్లడించారు. దేశంలో అణగారిన వర్గాలపై, మహిళల పై, పేద ప్రజలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ, బాధితులకు అండగా ఉంటూ పార్లమెంట్ లో గళం విప్పుతున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ప్రజా స్వామ్య వ్యవస్థలను, రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకొని అధికారం తమకే శాశ్వతం అన్నట్లుగా ప్రాంతీయ, జాతీయ పార్టీలను చిల్చుతూ ఇక మాకు ఎదురు లేదు అన్నట్లుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గతంలో తెలంగాణ రాష్ట్రంలో మాకు ఎదురే లేదు అన్నట్లు వ్యవహరించిన కేసీఆర్ ప్రజలు ఏ విధంగా గుణపాఠం చెప్పారో రానున్న ఎన్నికలలో బీజేపీ పార్టీకి, మోడీ ప్రభుత్వానికి అదే రీతిలో ప్రజలు గుణపాఠం చెబుతారని వెల్లడించారు. రానున్న లోక్ సభ ఎన్నికలలో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని, రాష్ట్రంలో మరోసారి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ఆ దిశగా ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికునిగా పని చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, గుడి వంశీధర్ రెడ్డి, గుర్రం ప్రసాద్, జిల్లా అధికార ప్రతినిది బెల్దే వెంకన్న, జిల్లా నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల దర్యాప్తు, శాంతిభద్రతల నిర్వహణకు నూతన పరికరాలు అందజేత

## జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్

**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** జిల్లా పోలీసు శాఖను మరింత సాంకేతికంగా బలోపేతం చేయడం, ప్రజలకు వేగవంతమైన,సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో ఈరోజు నిర్మల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లకు నూతన సాంకేతిక పరికరాలను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు బార్‌కోడ్ స్కానర్లు, లేబుల్ ప్రింటర్లు, సింగిల్ డిజిట్ స్కానర్లు, ఫింగర్ ప్రింట్ బ్యూరో సిస్టమ్స్, ఫింగర్ ప్రింట్ స్కానర్లు, ప్రింటర్లను పంపిణీ చేశారు.ప్రస్తుతం పోలీస్ స్టేషన్లలో కేసుల సంఖ్య పెరగడం, కంప్యూటర్లు, ట్యాబ్‌ల సాంకేతిక సమస్యల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఈ పరికరాలు ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా కోర్టు కేసుల వివరాలను వేగవంతంగా నమోదు చేయడం, కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు సమన్వయ అధికారులు,ప్రాసిక్యూషన్ అధికారులకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించడం ద్వారా న్యాయ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీటి సహకారం అందనుంది.

**పరికరాల ప్రాధాన్యత**

వేలిముద్ర (ఫింగర్ ప్రింట్) స్కానర్లు వ్యక్తుల గుర్తింపును ధృవీకరించడం, నేర చరిత్రను గుర్తించడం, అనుమానితుల వివరాలను తక్షణమే సేకరించడం మరియు పెండింగ్ కేసుల ఛేదనలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.




సింగిల్ డిజిట్ స్కానర్లు పోర్టబుల్ బయోమెట్రిక్ పరికరాలైన ఇవి వ్యక్తుల గుర్తింపును క్షణాల్లో ధృవీకరించడంతో పాటు కేంద్రీకృత డేటాబేస్‌లతో సరిపోల్చి నేర చరిత్రను తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి. బార్‌కోడ్ స్కానర్లు ముద్రించిన బార్‌కోడ్‌లను డిజిటల్ సమాచారంగా మార్చి రికార్డుల నిర్వహణ, సాక్ష్యాల ట్రాకింగ్ మరియు ఇతర పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేస్తాయి.

లేబుల్ ప్రింటర్లు కేసు ఫైళ్లు, సాక్ష్యాధారాలు మరియు ఇతర రికార్డులను ఖచ్చితంగా గుర్తించి నిర్వహించడంలో కీలకంగా ఉపయోగపడతాయి. తెలంగాణ పోలీస్ శాఖలో సాక్ష్యాల భద్రత, రికార్డుల నిర్వహణలో ఇవి ముఖ్యమైన సాధనాలుగా పని చేయనున్నాయి.జిల్లా పోలీస్ శాఖను మరింత సాంకేతికంగా బలోపేతం చేసి, ప్రజలకు వేగవంతమైన మరియు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పరికరాలను అందజేసినట్లు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ తెలిపారు.

ఈ పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ తో పాటు  ఏఓ యూనస్ అలీ, ఇన్స్పెక్టర్లు కృష్ణ, గోవర్ధన్ రెడ్డి,సమ్మయ్య,  ఆర్.ఐ (అడ్మిన్) రామ్ నిరంజన్ రావ్ ,ఎస్సైలు జీ.లింబాద్రి , శ్రీకాంత్, రవీందర్ , గణేష్ , గోపి, శ్రావణి, హన్మండ్లు , డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీబిపుట్టినరోజు వేడుకలు

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేకల చంద్రయా యాదవ్



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:**  ఘనంగా కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీబిపుట్టినరోజు వేడుకలు శుక్రవారం పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో రోజునపార్టీ మండల అధ్యక్షుడు  సత్యం అధ్యక్షతన ఏఐసీసీ అగ్ర నాయకులు, లోక్ సభ ప్రతిపక్ష నేత కాబోయే బావి భారత ప్రధాని రాహుల్ గాంధీ  జన్మదినం సందర్భంగా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం వేడుకలు అంబేద్కర్ చౌరస్తాలో కాబోయే భారత ప్రధాని రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది,ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథి డా," పగడాల శ్రీనివాస్ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ మాజీ గ్రంథాలయ చైర్మన్ విష్ణు ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అరవిందు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే త్యాగాల పునాదుల మీద నిర్మించబడింది ఇందిరా గాంధీ రాజీవ్ గాంధీ ఈ దేశం కొరకు ప్రాణ త్యాగాలు చేయడం జరిగింది అలాంటి కడుపున పుట్టిన రాహుల్ గాంధీ ఈ దేశ పేద ప్రజల తలరాతలు మార్చడానికి కలలు కంటున్నా యువ నాయకులు రాహుల్ గాంధీని కొనియాడడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకట స్వామి గౌడ్    కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మోహన్, జరుపటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాల బుక్స్ గోదాంను సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు మరియు ఇతర స్టేషనరీ సామగ్రిని విక్రయించేందుకు ప్రత్యేకంగా గోదాంను ఏర్పాటు చేసిన సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.విద్యార్థి సంఘాల ఫిర్యాదుపై స్పందించిన సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)యన్. రాజేశ్వరరావు పాఠశాలను తనిఖీ చేసి, అక్రమంగా నిర్వహిస్తున్న బుక్స్ గోదాంను సీజ్ చేశారు.ఈ సందర్భంగా ఎఐఎస్ ఏ జిల్లా కార్యదర్శి జమ్మి అశోక్, జార్జిరెడ్డి  పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు ఎస్. మందా సురేష్,బిఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు దాసరి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యాసంస్థలే విద్యార్థులకు బలవంతంగా పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, స్టేషనరీ సామాగ్రి విక్రయించడం అనైతిక చర్య అని విమర్శించారు.జిల్లా వ్యాప్తంగా అనేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులను దోపిడీ చేస్తూ పుస్తకాలు, యూనిఫాంలు మరియు ఇతర విద్యా సామాగ్రిని అధిక ధరలకు విక్రయిస్తున్నాయని వారు ఆరోపించారు. ఇటువంటి విద్యాసంస్థలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా విద్యా హక్కు చట్టం (ఆర్ టి ఇ యాక్ట్ ) మరియు ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించే విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బిఎస్ ఎఫ్ ఐ  జిల్లా కార్యదర్శి చిలుముల అజయ్, విద్యార్థి సంఘ నాయకులు సాయి, బాలాజీ, రాము తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు , కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొని కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశ ప్రజల హక్కుల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్న నాయకుడని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న కృషి అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ యండి రెహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, ఎఎంసి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, సత్తుపల్లి పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలు పాటిస్తే సురక్ష జీవితం

### ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీ శివమ్ ఉపాధ్యాయ

### కొత్తూరు వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తేనే సురక్షితంగా తమ గమ్యాలకు చేరుకుంటారని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ డీసీపీ శివమ్ ఉపాధ్యాయ అన్నారు.శుక్రవారం కొత్తూరు వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ డీసీపీ శివమ్ ఉపాధ్యాయ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీ, షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య, కొత్తూరు ఎస్‌హెచ్‌ఓతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ శివమ్ ఉపాధ్యాయ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాంతక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. రహదారి భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సురక్షిత ప్రయాణానికి ట్రాఫిక్ నిబంధనలే ప్రధానమని పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, భద్రత కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అవగాహన కార్యక్రమం సందర్భంగా పలువురు వాహనదారులు హెల్మెట్లు కొనుగోలు చేసి ధరించారు.సుమారు 150 మందికి పైగా ప్రజలు పాల్గొన్న ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని, ప్రజల భాగస్వామ్యంతో ట్రాఫిక్ భద్రతపై మరింత చైతన్యం పెరుగుతుందని కొత్తూరు సీఐ నర్సయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణ ప్రక్రియ వేగవంతం కావాలి

### ప్రత్యేక టీములు సమన్వయంతో పని చేయాలి

### సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, గద్వాల ఎమ్మెల్యే



**గద్వాల అక్షిత న్యూస్:** జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో భూసేకరణ ఆలస్యం కావడంపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రెవిన్యూ, సర్వే, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిపి ఏర్పాటు చేసిన ప్రత్యేక టీములు సమన్వయంతో పని చేయాలన్నారు. గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా రిజర్వాయర్, సమాంతర కాలువల నిర్మాణానికి ఇంకా అవసరమైన భూసేకరణ వేగవంతం కావాలన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా వివిధ ప్యాకేజీలలో పెండింగ్ లో ఉన్న 541 ఎకరాల్లో గత 15 రోజుల్లో 56 ఎకరాలకు ప్రిలిమినరీ డిక్లరేషన్ ఇచ్చినందున మిగిలిన భూసేకరణ కూడా చేపట్టాలన్నారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను కూడా వేగవంతం చేయాలన్నారు. భూ సేకరణకు సంబంధించి ఎవరైనా రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైతే సంబంధిత గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రాజెక్టుల ఆవశ్యకత, ప్రభుత్వ అవసరాల గురించి వివరించి ఒప్పించాలన్నారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం జిల్లాలో ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి రివ్యూ నిర్వహించడం జరుగుతుందని సంబంధిత అధికారులు భూసేకరణ విషయంలో ఎప్పటికప్పుడు పురోగతిని సాధించి నివేదికలు సమర్పించాలన్నారు. అనంతరం ఆయా మండలాల వారీగా వివిధ గ్రామాల పరిధిలో చేపట్టాల్సిన భూసేకరణ పై సంబంధిత మండలాల అధికారులతో క్షుణ్ణంగా మాట్లాడారు.

ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ ఈఈలు సంజీవ్ ప్రసాద్, శ్రీనివాసులు, ఇతర ఇంజనీర్లు, ఆయా మండలాల తహసిల్దార్ లు, సర్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ భద్రాద్రి నూతన కార్యవర్గం ఎన్నిక




**భద్రాచలం, అక్షిత న్యూస్:** పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న గ్రీన్ భద్రాద్రి సంస్థ 14వ, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. సంస్థ అధ్యక్షుడిగా ఆర్. రామకృష్ణారెడ్డి, కార్యదర్శిగా భుక్యా రంజిత్ నాయక్, కోశాధికారిగా ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డా, కృష్ణ ప్రసాద్, వీరయ్య, మహిళా విభాగం జాయింట్ కార్యదర్శిగా లక్ష్మీ సావిత్రి, పీఆర్ఓగా సంపత్, లీగల్ అడ్వైజర్‌గా రామరాజు తిరుమలరావు నియమితులయ్యారు. హార్టికల్చర్ అడ్వైజర్లుగా లయన్స్ డా,గొళ్ళ భూపతిరావు, కామిశెట్టి కృష్ణ (పార్క్ కృష్ణ) బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం జరిగిన భద్రాద్రిసంస్థ 14వ, నూతన కార్యవర్గం ఎన్నిక నేపథ్యంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం,వెంకట్రా రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.. భద్రాచలం సర్పంచ్, యోగి సూర్యనారాయణ, బిపిఎల్ ప్రముఖ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, భగవాన్ స్వీట్స్ అధినేత శంకర్, పల్లంటి దేశప్ప, క్వెస్ట్ రాజారెడ్డి, చిట్టి లలిత, డా, లయన్ గొల్ల భూపతిరావు, ఉమాశంకర్ నాయుడు, పార్క్ కృష్ణార్జునరావు, బొలిశెట్టి రంగారావు, చింతిరియాల రవికుమార్, పరమి సోమశేఖర్, సోమరులు శ్రీనివాసరావు, జక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ భద్రాచలం పుణ్యక్షేత్రం మాత్రమే కాకుండా పచ్చదనానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. యువ నాయకత్వంతో ఏర్పడిన గ్రీన్ భద్రాద్రి నూతన కార్యవర్గం భద్రాచలాన్ని మరింత హరితవనంగా తీర్చిదిద్దాలని సూచించారు. పట్టణ ప్రముఖులు యోగి సూర్యనారాయణ మాట్లాడుతూ సమాజ సేవతో పాటు పర్యావరణ పరిరక్షణలో గ్రీన్ భద్రాద్రి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ద్వారా నిజమైన పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి పుణ్యక్షేత్రంగా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని, అలాంటి పవిత్ర క్షేత్రంలో పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే మహోన్నత వృక్షారోపణ కార్యక్రమాలను విజయవంతం చేయడం తమ ప్రధాన లక్ష్యమని నూతన కార్యవర్గం పేర్కొంది. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి గ్రీన్ భద్రాద్రిని ప్రజలకు మరింత చేరువ చేస్తామని సభ్యులు తెలిపారు.

# పండితాపురంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

### రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అవమానపరిచిన బిజెపి మతతత్వ శక్తుల దుర్మార్గాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ సమ సమాజ సాధన కొరకు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్న వ్యక్తి భావి భారత దిక్సూచి రాహుల్ గాంది అని వారి కుటుంబం చేసిన త్యాగం ఎన్నటికీ ఈ దేశం మరిచిపోదని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు టిపిసిసి మెంబర్ పుచ్చకాయల వీరభద్రం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్ పిఎసిఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు తోటకూరి శివయ్య లు పేర్కొన్నారు.రాహుల్ గాంధీ 56 వ జన్మదినోత్సవం సందర్భంగా కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో మండలకాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్రంలో మొక్కజొన్నలు ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతుల ఖాతా లో నేరుగా డబ్బులు జమచేయడం జరిగిందని రైతులు హర్షం ప్రకటించి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం తోపాటు భారీ కేక్ కట్ చేసి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాహుల్ గాంధీ తాత జవహర్ లాల్ నెహ్రూ మన దేశ స్వాతంత్రం కోసం అనేకసార్లు జైలుకు వెళ్లి వచ్చారని ఇందిరాగాంధీ రాజీవ్ గాంధీ మతతత్వ శక్తులు విద్రోహుల చేతిలో దేశం కోసం ప్రాణాలు పోగొట్టుకున్నారని వారి వారసుడు రాహుల్ గాంధీ దేశం కోసం ప్రజలందరి బాగుకోసం తమ జీవితాన్ని పణంగా పెట్టి ఒక పెద్ద యుద్ధమే చేస్తున్నారని అలాంటి వ్యక్తి భారత దేశ ప్రధానమంత్రి అయితే ఈ దేశం సుభిక్షంగా అందరి జీవితాలలో వెలుగులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాలోత్ సరిరాం నాయక్ సర్పంచులు ధరావత్ అనురాధ లకావత్ సునీత భాష రెడ్డి ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు ఏఎంసి డైరెక్టర్ గబ్రు నాయక్ గుగులోతు రవి పండగ కోటి నరాటి చంద్రరావు కోటయ్య సత్తి వీరబాబు కొమ్మినేని శ్రీనివాసరావు పాటిబండ్ల ప్రసాద్ బొడ్డు లక్ష్మి నారాయణ చల్ల మల్లయ్య బాధావత్ నాగరాజు శీలం పుల్లయ్య జక్కంపూడి వెంకటేశ్వర్లు, కాట్రాల వీరబాబు, సత్తిరెడ్డి ఇమ్మడి రామనాథం ఉప్పుగండ్ల వీరభద్రరావు అయితనబోయిన విఠల్ మొగిలి శ్రీను బుచ్చయ్య లాల మున్నా సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

## అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మట్



**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** మున్సిపల్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మట్ అన్నారు  శుక్రవారం కాగజ్‌నగర్ మున్సిపాలిటీని సందర్శించి పట్టణ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, పన్నుల వసూళ్లు, ప్రజా సేవల అమలు తీరును సమీక్షించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు .మున్సిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వార్డు కౌన్సిలర్లతో సమావేశమై పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.ఆనంతరం ఎల్లగౌడ్ తోట పార్క్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్ అక్కడ చేపట్టిన అభివృద్ధి పనులు, పరిశుభ్రత, పచ్చదనం, ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. పార్కు నిర్వహణను మరింత మెరుగుపరచడంతో పాటు పచ్చదన పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.బి. రామాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. శంకర్, పర్యావరణ ఇంజనీర్ డి. ప్రణీల్ కుమార్,అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పెంటన్న యాదవ్‌కు ఘన సన్మానం



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన పెంటన్న యాదవ్ ను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, డీసీసీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డిలు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తకోట పట్టణ అధ్యక్షులుగా పెంటన్న యాదవ్ ను ఎంపిక చేసిన జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో అందరిని కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చెయాలనీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకోవడమే మన అందరి బాధ్యత



**భద్రాచలం అక్షిత న్యూస్ :** ప్రతి మనిషి దైనందన జీవితంలో ఆరోగ్యంగా ఉండాలంటే పర్యావరణం పచ్ఛధనం,పరిశుభ్రం, కోసం పర్యావరణాన్ని కాపాడు కోవాలని, కనుక సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత మొక్కలు నాటి వాటి సంరక్షణ కోసం బాధ్యత తీసుకోవాలని అప్పుడే  వాతావరణం ఆహ్లాదకరంగా ఉండి ఎటువంటి అనారోగ్యాలు దరి చేరవని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.

శుక్రవారం నాడు తన చాంబర్లో ఫారెస్ట్, ఐ టి సి, ఎం ఎన్, ఆర్,ఏ,జి,ఎస్ గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి సారపాక గ్రామపంచాయతీలో లక్షల మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకునే విధంగా ప్రణాళికలు రూపొందించడానికి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో పర్యావరణం కలుషితం కాకుండా సారపాక గ్రామపంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో భాగంగా సంవత్సరానికి 25 వేల మొక్కలు చొప్పున నాలుగు సంవత్సరాలకు లక్ష మొక్కలు సారపాక లోని ప్రజలు ఎక్కువగా సంచరించే ఖాళీ ప్రదేశాలలో గోదావరి పరివాహక ప్రాంతాలలో ముఖ్యమైన కూడళ్లలో ప్రజలకు ఉపయోగపడే  మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకునే విధంగా సంబంధిత అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ముఖ్యంగా గానుగ, వేప, చింత, జామ, నేరేడు చెట్లతోపాటు వివిధ రకాల పండ్లకు సంబంధించిన మొక్కలను నాటాలని అన్నారు. లక్ష మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను పగడ్బందీగా తీసుకోవడానికి ఫారెస్ట్,ఐటిసి, ఎంఆర్ఇజిఎస్ అధికారులు గ్రామపంచాయతీ వారికి వివిధ రకాలు మొక్కలు అందించి వాటిని క్రమమైన పద్ధతిలో నాటించి ఈ కార్యక్రమం దిగ్విజయంగా విజయవంతం అవ్వడానికి సహకరించాలని ఆయన అన్నారు. అలాగే ఈ వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజలను కూడా భాగస్వామ్యం చేసి గ్రామాలలో  ప్రభుత్వ కార్యాలయాలలో మనకు ప్రాణవాయువును ప్రసాదించే చెట్లను నాటి వాటిని సక్రమంగా పెంచి వాతావరణం కలుషితం కాకుండా చూడాలని ఆయన చెప్పారు . చెట్లను పెంచడం వలన పరిసరాలు శుభ్రంగా ఉండి మనకు ఎటువంటి  అనారోగ్యాలు దరిచేరవని అన్నారు.

పర్యావరణ పరిరక్షణ మొక్కల పెంపకం ఎంతో దోహదపడుతుందని, మానవాళి అంతా ఆరోగ్యంగా ఉండాలంటే మన చుట్టూ ఉన్న పరిసరాలు పచ్చదనంతో కళకళలాడాలని, అందుకు తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ఆయన ఆదేశించారు..

ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు, సారపాక సర్పంచ్ కిషోర్ శివరామ నాయక్, ఫారెస్ట్ డిఆర్ఓ ధారావత్ కృష్ణ, ఐటిసి డిప్యూటీ జిఎం విశ్వనాథం,ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గ్రామ పాలన అధికారుల అసోసియేషన్

## రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీ ప్రేమ్ కుమార్ మరియు జీపీవోపై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తోంది

## ఆర్ విజయ్ మల్లారం అర్జున్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ మండలం, తుర్కయంజాల్ గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీ ప్రేమ్ కుమార్ మరియు జీపీవోపై జరిగిన దాడి ఘటనను తెలంగాణ గ్రామ పాలన అధికారుల అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోంది. ఉన్నతాధికారులైన ఆర్డీవో మరియు తహసీల్దార్ ఆదేశాల మేరకు వివాదాస్పద భూమి వద్ద విధులు నిర్వహించడానికి వెళ్లిన ప్రభుత్వ ఉద్యోగులపై దౌర్జన్యానికి పాల్పడటం అత్యంత విచారకరం మరియు ఆందోళనకరం.

ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను అడ్డుకోవడం, వారి గుర్తింపు కార్డును లాక్కోవడం, దుర్భాషలాడటం, శారీరకంగా దాడి చేయడం, అలాగే కులం పేరుతో అవమానించడం వంటి చర్యలు చట్టవిరుద్ధమైనవి మరియు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైనవి. ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయాలంటే విధి నిర్వహణలో ఉన్న అధికారులకు భద్రత, గౌరవం మరియు సహకారం లభించాలి. ఇటువంటి సంఘటనలు ప్రభుత్వ ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తాయి. ఈ ఘటనపై ప్రభుత్వం మరియు పోలీసు శాఖ వెంటనే స్పందించి, దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గ్రామ పాలన అధికారుల అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామ పాలన అధికారుల తరపున అధికారులకు తగిన రక్షణ కల్పించాలని కోరుతోంది. గరిక ఉపేందర్ రావు రాష్ట్ర అధ్యక్షులు ఆర్ విజయ్ మల్లారం అర్జున్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు తెలంగాణ గ్రామ పాలన అధికారుల అసోసియేషన్ కమిటీ.

# ఖమ్మం ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

## ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు పోరాడుతున్న గొప్ప నేత అని కొనియాడిన ఎంపీ రఘురాం రెడ్డి

## పార్టీ శ్రేణుల నడుమ కేక్ కటింగ్



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవ వేడుకలను శుక్రవారం ఖమ్మం లోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి హాజరై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నడుమ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు సామాజిక న్యాయం అందించేందుకు రాహుల్ గాంధీ నిబద్ధతతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రధానిగా చూడాలనేది ప్రజల ఆకాంక్ష అని భవిష్యత్తులో ఇది సాకారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు దీపక్ చౌదరి సీనియర్ నాయకులు మిక్కిలినేని నరేంద్ర యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్ మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ప్రతిభా రెడ్డి కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్ టీపీసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ ఇమామ్ భాయ్ నాయకులు కిరణ్ నాయక్ మేడా వెంకట్రావ్ క్రాంతి పలువురు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్వాసకోశ గుండె వైఫల్యంతో బాధపడుతున్న వారికి యశోద హాస్పిటల్స్ సోమాజిగూడలో అత్యాధునిక పద్ధతిలో వైద్యం

### ఇప్పటివరకు ఎక్స్ ట్రా కార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ ఎక్మో ద్వారా కొన్ని వందల కేసులు పరిష్కారం




**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం యశోద మెడికల్ సెంటర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ క్రిటికల్ కేర్ సీనియర్ డాక్టర్ వై.సూర్య ప్రకాష్ (యుఎస్ఏ) మాట్లాడుతూ సాధారణ చికిత్సలు సరిపోని పరిస్థితులలో ప్రాణాలను కాపాడటంలో అధునాతన క్రిటికల్ కేర్ విధానాలలో ఎక్మో ఒకటి శ్వాసకోశ లేదా గుండె వైఫల్యంతో బాధపడుతున్న పేషెంట్లకు ఎక్స్ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ లాంటి సాంకేతికతలు ప్రాణాలను నిలబెట్టే పరిష్కారాలుగా మారాయి అని కృత్రిమ గుండె ఊపిరితిత్తుల లాగా పనిచేస్తూ ఎక్మో శరీరంలోని ముఖ్యమైన అవయవాల పనితీరుకు మద్దతు ఇస్తుంది.తద్వారా పేషెంట్ శరీరం కోలుకోవడానికి తగిన సమయం లభిస్తుంది. అలాగే పారాక్వాట్ విషప్రభావం డ్రగ్ ఓవర్డోస్ వంటి తీవ్రమైన విషప్రభావాల కేసులను నిర్వహించడంలో ప్రత్యేక డయాలసిస్ మరియు ఎక్మో థెరపీలు ఎంతో ఉపయోగపడుతున్నాయి అని అన్నారు.ఒకప్పుడు ఇలాంటి పరిస్థితుల్లో ప్రాణాపాయం ఎక్కువగా ఉండేది.గత దశాబ్ద కాలంలో క్రిటికల్ కేర్ వైద్యరంగంలో సాధించిన అద్భుతమైన ప్రగతి ఈ అత్యాధునిక విధానాలు. ఇవి ప్రాణాంతక పరిస్థితుల నుంచి బయటపడేలా పనిచేస్తున్నాయని తెలిపారు.యశోద ఆసుపత్రి అధునాతన క్రిటికల్ కేర్ మౌలిక సదుపాయాలు. మల్టీడిసిప్లినరీ నిపుణులు ఎవిడెన్స్ - బేస్డ్ ట్రీట్మెంట్ ప్రోటోకాల్స్ లో ప్రత్యేక శ్రద్ధ పెడుతూనే ఉంది. ఐసీయూ అవేర్నెస్ వంటి కార్యక్రమాల ద్వారా ఆధునిక ఇంటెన్సివ్ కేర్ ప్రాణాలను ఎలా కాపాడుతుంది రోగులు కోలుకోవడంలో ఇది పోషించే కీలక పాత్ర గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసామని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీధర్ రావు పరమేశ్ నాగార్జున బాలకృష్ణ పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడి సొంతింటి కళ ఇందిరమ్మ ఇల్లు

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** తెలంగాణ రాష్టంలో ఉన్న ప్రతి పేదవాడి కళ ఇందిరమ్మ ఇల్లు అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యాతిథులుగా హాజరయ్యారు. కొత్తకోట మున్సిపాలిటీలో మోటర్ సైకిల్ తో విసృతంగా పర్యటించారు. పుర వీదుల్లో తిరుగుతూ ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న కుటుంబాలకు పట్టు వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇండ్లు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ, వైస్ చైర్మన్ పల్లవి, సీడీసీ చైర్మన్ చంద్రమోహన్ రెడ్డి, కౌన్సిలర్లు బోయోజ్, సుధా రెడ్డి, అఖిల, చంద్రకాంత్, సంజీవుడు, నభి, మురళి, డబ్బా సలీం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బిచుపల్లి యాదవ్, పట్టణ అధ్యక్షులు పెంటన్న యాదవ్, కృష్ణారెడ్డి, చర్లపల్లి శేఖర్ రెడ్డి, మిరాసిపల్లి సాయి రెడ్డి, రావుల కరుణాకర్ రెడ్డి, బాలరాజు యాదవ్, సంద వెంకటేష్, సుభాష్, శివ యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ యువతకు ఆదర్శం

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

### కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

### డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ భారతదేశ యువతకు ఆదర్శమని, ఆయన స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా కొత్తకోట, మదనాపురం, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వనపర్తి డిసిసి చీఫ్ శివసేన రెడ్డి అధ్యక్షతన ఘనంగా వేడుకలు జరిగాయి. కాంగ్రెస్ శ్రేణుల మధ్య రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ ప్రజల సంక్షేమం సామాజిక న్యాయం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. దేశ ప్రజల సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజా సమస్యల పరిరక్షణకు సంబంధించిన పోరాటం యువతకు స్ఫూర్తినిచ్చి ప్రేరణగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా శ్రేయస్సు కోసం మరింత కృషి చేస్తున్న నాయకుడు భావితరాల భవిష్యత్తు, భావి భారత ప్రధాని రాహుల్ గాంధీనాన్ని నాయకుల ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు వారి సహాయకులకు, అభాగ్యులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ, మాదవి, వైస్ చైర్మన్ పల్లవి, మధుసూదన్, సీడీసీ చైర్మన్ చంద్రమోహన్ రెడ్డి, కౌన్సిలర్లు బోయోజ్, సుధా రెడ్డి, అఖిల, చంద్రకాంత్, సంజీవుడు, నభి, మురళి, డబ్బా సలీం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బిచుపల్లి యాదవ్, పట్టణ అధ్యక్షులు పెంటన్న యాదవ్, కృష్ణారెడ్డి, చర్లపల్లి శేఖర్ రెడ్డి, మిరాసిపల్లి సాయి రెడ్డి, రావుల కరుణాకర్ రెడ్డి, బాలరాజు యాదవ్, సంద వెంకటేష్, సుభాష్, శివ యాదవ్, వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కదిరే రాములు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, శరవంద, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పలువురు పాల్గొన్నారు.



# తెలంగాణ పబ్లిక్ స్కూల్ మీద రాజకీయాలు చేయడం సిగ్గుచేటు

### పేద పిల్లలు పెద్ద చదువులు చదవడం ఇష్టం లేకనా?

### తమకు భవిష్యత్తు ఉండదని భయమా?

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

### మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి





**రంగా రెడ్డి అక్షిత బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ పై రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం రోజున ఆరుట్ల గ్రామంలో గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులు నూకం బాలరాజు, చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేస్తూ ధనవంతుల పిల్లలు ఎలాంటి స్కూళ్లలో చదువుకుంటున్నారో పేద పిల్లలు కూడ అలాంటి స్కూళ్లలో చదువుకోవాలని అంతర్జాతీయ ప్రమాణాలతో సకల వసతులతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తూ మొట్టమొదట ఆరుట్ల గ్రామంలో ప్రారంభం చేస్తే పేద పిల్లలు ఉన్నత చదువులు చదవడం ఇష్టం లేనివారు భవిష్యత్తులో తమకు రాజకీయంగా పుట్టగతులు ఉండవనే భయంతో అవినీతి అంటూ కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నారని అన్నారు.

మీకు నిజంగా అనుమానాలు ఉంటే స్కూల్ వద్దకు వెళ్లి అక్కడి పేరెంట్స్ కమిటీ ఉపాధ్యాయ బృందం ద్వారా వాస్తవాలు తెలుసుకోవాలని అన్నారు. ఇట్లా తెలంగాణ పబ్లిక్ స్కూల్ కి అవమానం కల్గిస్తే విద్యార్థుల,వారి తల్లిదండ్రుల, సమాజం పట్ల విద్య పట్ల అవగాహన కల్గిన విద్యావంతుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తది అని హెచ్చరించారు.

గత బిఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ విద్యను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశారని స్థానికంగా గత ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఎన్నడూ స్కూళ్ల గురించి పట్టించుకోలేదని అన్నారు. గతంలో గర్ల్స్ హైస్కూల్ భవనం గానీ మోడల్ స్కూళ్లను కాంగ్రెస్ పార్టీ హయాంలో దేశవ్యాప్తంగా ఏర్పాటు చేశారని,వాటికి మంచిరెడ్డికి సంబంధమే లేదని అన్నారు. బాయ్స్ హైస్కూల్ భవనాన్ని మంచిరెడ్డి తిరస్కరిస్తే గ్రామంలోని పెద్దలు, యువకులు జేఏసీ గా ఏర్పడి అప్పటి రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం చొరవతో కడియం శ్రీహరిని విన్నవిస్తే మంజూరు అయిందని తనకు తెలియకుండా మంజూరు అయిందనే నెపంతో మంచిరెడ్డి దానిని ఆపాలని విశ్వప్రయత్నం చేశారని అన్నారు.

ఇప్పటికైనా అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయకుండా పార్టీలకతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్ లాలగారి శ్రీకాంత్ మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి సలాం వార్డు మెంబర్లు ఎండి ఇమ్రాన్ అనంగల్ల జగన్నాదం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి ఆరుట్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగల పరమేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య మార సురేష్ వెదిరే రమణారెడ్డి మాధగోని జంగయ్య గౌడ్ రావుల భాషయ్య దాసరమోని రమేష్ మానిపాటి వెంకటేష్ చెరుకు నర్సింహా సుంకరి ప్రవీణ్ మార లక్ష్మణ్ బుట్టి కృష్ణ కోరె బాబు కంబాలపల్లి బుగ్గరాములు వస్పరి కుమార్ తలారి కృష్ణ నూకం మల్లేష్ లచ్చుగారి జంగారెడ్డి ఉదరి నర్సింహా చీమర్ల క్రాంతికుమార్ చెనమోని శంకర్ దాసరమోని అశోక్ రావుల నాగరాజు గుడ్డిమల గిరిప్రసాద్ మాడపాకుల యాదగిరి భాస్కర్ రైనా ఆడెపు మధు ఎండి అశ్రఫ్ ఎండి రఫీక్ మానిపాటి బుగ్గరాములు అంతటి కృష్ణ తలారి శ్రీను మారగోని శివ గొరిగే కృష్ణ దూసరి రాజు జక్కుల యాదగిరి మంకు ప్రవీణ్ గడ్డం సత్తయ్య మాడపాకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

## కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో 25వ డివిజన్ పరిధి సుభాష్ నగర్ ఏరియా బుట్టిరాజారాం కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్డిఆర్ఓ స్వామి, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇల్లు మంజూరై పనులు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణం ప్రారంభించేలా చూడాలన్నారు. జిల్లాలో బిల్లులు జమ కాని లబ్ధిదారుల వివరాలతో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇళ్ల నిర్మాణం పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ స్వామి, గృహ నిర్మాణ శాఖ అధికారులు డీఈ వెంకటరమణ, ఏఈలు ఊర్మిళ, వర్షిని తదితరులు పాల్గొన్నారు.

## మునిపంపుల గ్రామ శ్రేయస్సు కోసం

# బొడ్రాయి వార్షికోత్సవంలో ప్రత్యేక పూజలు

**రామన్నపేట అక్షిత ప్రతినిధి :** మునిపంపుల గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ఆకాంక్షించారు. శుక్రవారం రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలో బొడ్రాయి నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పాల్గొని బొడ్రాయికి జలాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతుల పంటలు బాగా పండాలని, ప్రజలంతా శాంతి సామరస్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి శ్రీనివాస్ శర్మ అర్చకత్వం వహించారు.



అనంతరం భక్తులకు పులిహోర, పాయసం ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తాళ్ల క్రాంతికుమార్, గ్రామ పెద్దలు మామిడి పద్మారెడ్డి, మాజీ సర్పంచులు కూనూరు రాములమ్మ-రవికుమార్, కట్ట యాదయ్య, మామిండ్ల శేషాద్రి, ఉయ్యాల లక్ష్మీనర్సు, మన్నెం పద్మారెడ్డి, బూడిద నర్మద, యాదాసు శారద, నీల రజిత, మామిడి అంజిరెడ్డి, పాండు రెడ్డి, తాళ్లపల్లి జితేందర్, తొలుపునూరి చంద్రశేఖర్, మామిళ్ల కుమారస్వామి, మేక మల్లారెడ్డి, ఉడతల శ్రీనివాస్, తాళ్ల వెంకటేశం, బూడిది మారయ్య తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కార్డుల కోసం

# మధ్య దళారులను నమ్మి మోసపోవద్దు

## జిల్లా లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్

**గద్వాల అక్షిత న్యూస్:** భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులు లేబర్ కార్డుల నమోదు లేదా పునరుద్ధరణ కోసం మధ్య దళారులను ఆశ్రయించి మోసపోవద్దని జిల్లా లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం గద్వాల మండలంలోని నది అగ్రహారం గ్రామంలో భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల నమోదు,పునరుద్ధరణ, సంక్షేమ పథకాలు మరియు కార్మికుల హక్కులపై అవగాహన కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, గత 12 నెలల్లో కనీసం 90 రోజులు భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పరిధిలోని 54 రకాల నిర్మాణ వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులు సభ్యత్వం పొందడానికి అర్హులని వివరించారు.

నమోదైన కార్మికులకు ప్రసూతి సహాయం, వివాహ సహాయం, విద్యా సహాయం, ప్రమాద/సహజ మరణ పరిహారం, అంత్యక్రియల ఖర్చులు తదితర



సంక్షేమ పథకాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్మికులు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, మొబైల్ నంబర్, ఫోటోలు, ఉపాధి ధ్రువీకరణ పత్రంతో సమీప మీ సేవ కేంద్రంలో రూ.110 సేవా రుసుము చెల్లించి రసీదు తీసుకుని, కలెక్టరేట్ గది నెం.23 లోని జిల్లా లేబర్ కార్యాలయంలో నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు.

సహజ మరణం మరియు ప్రమాద మరణానికి సంబంధించిన క్లెయిమ్‌ల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం ట్రైల్ బ్లేజర్ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పగించినట్లు తెలిపారు.

ఈ క్లెయిమ్‌లకు సంబంధించిన నామినీలు మరియు అర్హులైన కుటుంబ సభ్యులు అవసరమైన పత్రాలతో జిల్లా లేబర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ట్రైల్ బ్లేజర్ కంపెనీ ప్రతినిధి కార్తీక్ (మొబైల్ 7331119174) ను సంప్రదించి క్లెయిమ్ దరఖాస్తులను సమర్పించుకోవచ్చని వివరించారు.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో మోసాలకు పాల్పడుతున్న మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి సందేహాలు లేదా ఫిర్యాదులు ఉన్నా నేరుగా జిల్లా లేబర్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామంలోని నిర్మాణ కార్మికులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు

## కమీషనరేట్ వ్యాప్తంగా పాన్ షాపులపై పోలీసుల ఏకకాల తనిఖీలు



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** మాదకద్రవ్యాలు, నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలను అరికట్టేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం కమీషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల పరిసరాల్లో ఉన్న పాన్ షాపులను లక్ష్యంగా చేసుకుని పోలీసులు ఏకకాలంలో మెరుపు దాడులు చేపట్టారు.ఈ ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 99 పాన్ షాపులను పరిశీలించగా, నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కా,సిగరెట్లు తదితర వస్తువులను విక్రయిస్తున్న వారిపై తనిఖీల సందర్భంగా పోలీసు స్టేషన్ల వారీగా, కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 11 కేసులు, టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 13 కేసులు, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 8 కేసులు, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు, హుజూరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 8 కేసులు, కేశవపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు, జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో 4 కేసులు, వీణవంక పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు, ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు నమోదు చేశారు. మొత్తం 99 పాన్ షాపులను తనిఖీ చేసి, నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కా, సిగరెట్లు విక్రయిస్తున్న వారిపై 52 కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, యువతను మాదకద్రవ్యాలు మరియు హానికరమైన పొగాకు ఉత్పత్తుల బారిన పడకుండా కాపాడేందుకు పోలీస్ శాఖ నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యాసంస్థల పరిసరాల్లో నిషేధిత వస్తువుల విక్రయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.ఇలాంటి ప్రత్యేక తనిఖీలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని, నిషేధిత వస్తువుల విక్రయాలు, మాదకద్రవ్యాల రవాణా మరియు వినియోగంపై సమాచారం ఉంటే ప్రజలు వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని సీపీ గౌష్ ఆలం కోరారు.

# పోషకాహారం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి-డీడబ్ల్యూఓ మల్లీశ్వరి



**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** మహిళలు,చిన్న పిల్లలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీడబ్ల్యూఓ మల్లీశ్వరి అన్నారు..చిన్న తనం నుండే పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందివ్వాలన్నారు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రజిత ఆధ్వర్యంలో అమ్మ మాట-అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు..ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డీడబ్ల్యూఓ మల్లీశ్వరి , స్థానిక కౌన్సిలర్ పాల్గొన్నారు..ఈ సందర్భంగా వారు మాట్లాడారు..చిన్నారుల ఆరోగ్యం,పోషకాహారంపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.. చిన్న పిల్లల తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు... గర్భిణీలకు, చిన్నపిల్లలకు అంగన్వాడీ ద్వారా పోషకాలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నామన్నారు..ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలన్నారు...ఈ సందర్భంగా అంగన్వాడి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అక్షరాబాస్యం కార్యక్రమం నిర్వహించారు.. ఐదు సంవత్సరాలలోపు పిల్లల్ని అంగన్వాడీలో చదివించాలని తెలియజేశారు..ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు వసంత,సుజాత,సరూప, రమతో పాటు పలువురు పాల్గొన్నారు..

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY

శనివారం | 20| జూన్ | 2026

# కాంగ్రెస్ పార్టీ పుణ్యమే భీమా ప్రాజెక్టులు

**రైతులను ఆదుకున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ**

**ఈ నెల 30 న రైతు భరోసా నిధులు విడుదల**

**భీమా ఫేస్ 2 స్టేజ్ 1 నుండి నీటి విడుదల**

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**





**వనపర్తి అక్షిత ప్రతినిధి :** భీమా ప్రాజెక్టులు కాంగ్రెస్ పార్టీ పుణ్యమే అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కొనియాడారు. శుక్రవారం వనపర్తి జిల్లా మదనాపురం మండలం తిర్మాలయపల్లి గ్రామ సమీపంలో ఉన్న భీమా ప్రాజెక్టులో భాగంగా భీమా ఫేస్ 2 ఫేస్ 1 లిఫ్ట్ నుండి శంకర సముద్రానికి గ్రావిటి ద్వారా నీటిని విడుదల చేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యతితులుగా హాజరయ్యారు. ముందుగా స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ అండగా ఉందని అన్నారు. అన్ని విధాల ఆదుకున్నది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఈనెల 30న రైతు భరోసా కింద రైతులకు తెలంగాణ రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అయంలోనే భీమ ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొద్దిపాటి భీమా ప్రాజెక్టుల పనులు పూర్తి చేయలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెండింగ్లో ఉన్న బీమా ప్రాజెక్ట్ లు పూర్తిచేసే దిశగా అడుగులు ముందుకు వేస్తున్నాడని తెలిపారు. రైతులకు బోనస్ నిధులు జమ చేస్తూ అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపారు. బీమా ప్రాజెక్టు కింద ఉన్న ప్రతి ఆయకట్టును కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటిని అందిస్తూ రైతుల పక్షాన నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ, వైస్ చైర్మన్ పల్లవి, సీడీసీ చైర్మన్ చంద్రమోహన్ రెడ్డి, కౌన్సిలర్లు బోయోజ్, సుధా రెడ్డి, అఖిల, చంద్రకాంత్, సంజీవుడు, నభి, మురళి, డబ్బా సలీం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బిచుపల్లి యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, శరత్ రెడ్డి, శారద, పట్టణ అధ్యక్షులు పెంటన్న యాదవ్, కృష్ణారెడ్డి, చర్లపల్లి శేఖర్ రెడ్డి, మిరాసిపల్లి సాయి రెడ్డి, రావుల కరుణాకర్ రెడ్డి, జగదీష్, బాలరాజు యాదవ్, సంద వెంకటేష్, సుభాష్, శివ యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## భీంగల్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జయంతి వేడుకలు



**భీంగల్, అక్షిత న్యూస్ :-** బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండలం భీమ్గల్ పట్టణంలో కాంగ్రెస్ కార్యాలయం వద్ద మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ కటింగ్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలు పడం జరిగింది అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూదేశంలో బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేస్తున్న గోప్ప నాయకులు రాహుల్ గాంధీ గారని వెల్లడించారు. దేశంలో అణగారిన వర్గాలపై, మహిళల పై, పేద ప్రజలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ, బాధితులకు అండగా ఉంటూ పార్లమెంట్ లో గళం విప్పుతున్నారని తెలిపారు, అలాగేప్రజల కష్టాలను దగ్గరను తెలుసుకోవడానికి రాహుల్ గాంధీ భారత్ జూడయాత్రలో నిర్వహించడం జరిగింది ఇది కన్యాకుమారి నుండి శ్రీనగర్ వరకు 4000 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన ఘనత రాహుల్ గాంధీ ది.. ఈ యాత్రలో అనేక రాష్ట్రాలు తిరిగి ప్రజల కష్టాలను దగ్గర నుండి చూసి ప్రజల యొక్క గలాన్ని పార్లమెంటులో వినిపించిన ఘనత రాహుల్ గాంధీ ది అని అన్నారు. వచ్చే ఎలక్షన్లలో రాహుల్ గాంధీ కచ్చితంగా పీఎం అవుతారని దానికి మా వంతు కృషి తప్పకుండా చేస్తామని ఆశ భావం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో భీంగల్ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ పట్టణ అధ్యక్షుడు పరసా అనంతరావు మరియు కౌన్సిలర్లు ,వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్ లు, కార్యకర్తలు పాల్గొన్నారు...

## భూముల సర్వేకు వేగవంతమైన చర్యలు

**కలెక్టర్ కె. హరిత**




**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** జిల్లాలో నకలు లేని గిరిజన భూములు, సాదా బైనామా దరఖాస్తులు, భూ సంబంధిత పెండింగ్ సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో కలిసి భూముల సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల్లో భూ సమస్యలను గ్రామాల వారీగా గుర్తించి సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే నిర్వహణలో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన సిబ్బందిని సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేయాలని సూచించారు. సాదా బైనామా దరఖాస్తులను నెలాఖరులోగా పరిశీలించి అర్హులైన వారికి త్వరితగతిన పరిష్కారం అందించాలని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కలెక్టర్ తెలిపారు. భూ హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలకు పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, రెవెన్యూ శాఖ అధికారులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ శానిటేషన్ ప్రోగ్రాంలో భాగంగా సిల్ట్ తొలగింపు పనులను పర్యవేక్షించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ అక్షిత న్యూస్** కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగర పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా చేపడుతున్న స్పెషల్ శానిటేషన్ ప్రోగ్రాంలో భాగంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ 20వ మరియు 56వ డివిజన్లలో కొనసాగుతున్న సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో నగరంలో నీటి నిల్వలు ఏర్పడకుండా, మురికి కాలువల్లో నీటి ప్రవాహం సజావుగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్, చెత్తను పూర్తిస్థాయిలో తొలగించడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి శానిటేషన్ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని సూచించిన మేయర్, ప్రజల నుంచి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తాటి ప్రభావతి, పర్వతం మల్లేశం, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పారిశుద్ధ్య సిబ్బంది మరియు పలు డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ దేశ యువతకు ఆదర్శం

**యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోటే శ్రీశైలం**

**యాచారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు**

**ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి,రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ**





**రంగా రెడ్డి అక్షిత బ్యూరో :**లోక్‌సభ ప్రతిపక్ష నేత, నిరాడంబరుడు, నిగర్వి,భావి భారత ప్రధానమంత్రి రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా యాచారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీశైలం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాన్నమ్మ ఇందిరాగాంధి, తండ్రి రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం అని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల కోసం దేశం పై పట్టు వదలకుండా రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు ఎదురొడ్డి నిలబడి కొట్లాడుతున్న తీరు ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త ఆదర్శంగా తీసుకుని వారిని ప్రధాన మంత్రి చేసేందుకు కంకణ బద్ధులై పని చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల్ అధ్యక్షులు పాశం జయప్రకాష్, మేడిపల్లి నక్కర్త ఉప సర్పంచ్ దెంది మధూకర్ రెడ్డి ,సీనియర్ నాయకులు గౌరారం వెంకట్ రెడ్డి, చీర శేఖర్, సంగెం మల్లేశ్ ,మల్కిజ్ గూడ గ్రామ వార్డు సభ్యులు చీర మహేష్ ,బోడ మధు , రెడ్డి వెంకట్ రెడ్డి కేశమోని బుచ్చయ్య, వరికుప్పల యాదయ్య, బోడ రమేష్ ,యూత్ కాంగ్రెస్ నాయకులు ఎరుకలి చింటు, ఆరేపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.